క్లుప్తంగా

‘ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్’పై ఆన్‌లైన్ లెక్చర్

రాయదుర్గం: మనూలో ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఆన్‌లైన్ లెక్చర్ కార్యక్రమాన్ని సోమవారం కన్వీనర్ డాక్టర్ అశ్వని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ అండ్ ఐటీ ఫ్యాకల్టీ డాక్టర్ జమీల్ అహ్మద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్ మాట్లాడుతూ ఈ వేస్ట్‌తో అనేక అనర్థాలు కలుగుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వక్తలు సూచించారు. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కాగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ విభాగం ఆధ్వర్యంలో జీ–20 యూనివర్శిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు మహ్మద్ మోషాహిద్, వికారున్నీసా, డాక్టర్ శంషాద్‌బేగం, డాక్టర్ వీఎస్ సుమి, డాక్టర్ అబ్దుల్ జబ్బార్, డాక్టర్ సమద్ తాజా వడక్కాయిల్, జహంగీర్ అలమ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన కార్తీక్ (34) మూడు నెలల క్రితం బతుకుతెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ముకు వచ్చాడు. స్థానికంగా ఓ షోరూంలో ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 3వ తేదీన భార్య శ్రావణి తండ్రికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చూసేందుకు సనత్‌నగర్ కు వెళ్లింది. ఈ క్రమంలో 3 వ తేదీన భర్త కార్తీక్‌తో శ్రావణి ఫోన్‌లో మాట్లాడింది. తిరిగి అదే రోజు రాత్రి ఫోన్ చేస్తే కార్తీక్ స్పందించలేదు. మరుసటి రోజు కూడా ఫోన్ చేసిన భర్త స్పందించకపోవడంతో ఇంటికి వచ్చి చూడగా భర్త విగతజీవిగా కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


నగరంలో ‘వెస్టిన్’రెండో హోటల్ ప్రారంభం

సాక్షి,సిటీబ్యూరో: వెస్టిన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ హైదరాబాద్‌లో తన రెండవ హోటల్‌ను ప్రారంభించింది. రెండో హోటల్ అయిన ‘ ద వెస్టిన్ హైదరాబాద్, హైటెక్‌సిటీ’ని మహిళలే నిర్వహించడం దీని ప్రత్యేకత. ఈ సందర్భంగా మారియట్ ఇంటర్నేషనల్ సౌత్ ఏషియా వైస్ ప్రెసిడెంట్ రంజు అలెక్స్ మాట్లాడుతూ నగరంలో ఇలాంటి హోటల్ ఇదే ప్రథమమన్నారు. హోటల్ నిర్వహణలో సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, ఆధునికంగా ఆకట్టుకునేలా ఉంటుందన్నారు. చాలెట్‌హోటల్స్ లిమిటెడ్ సీఈఓ అండ్ ఎండి సంజయ్‌సేథి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు విచారకరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి 9 ఏళ్ల కాలంలో అనేకసార్లు విద్యుత్ చార్జీలు పెంచడం విచారకరమని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పేరిట ప్రభుత్వం ఏసీడీ చార్జీలను ఇష్టానుసారంగా వసూలు చేస్తోందని మండిపడ్డారు. రైతులకు 24గంటలు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నారే తప్ప దానిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, నవీన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శిల్ప, అమృత పాల్గొన్నారు.

శిల్పారామంలో జీ-20 ప్రతినిధులు



మాదాపూర్: జీ–20 హెల్త్ వర్కింగ్ గ్రూప్ మీటింగ్‌కు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు సోమవారం శిల్పారామంను సందర్శించారు. హస్తకళా ఉత్పత్తులను పరిశీలించారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా భారతదేశ సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ప్రణవి తుమ్మాటి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించగా, మందిరా చక్రవర్తి బృందం ఫ్యూజన్ నృత్యంతో ఆకట్టుకున్నారు.



ఆ ఆస్పత్రి అదుర్స్

- ఉత్తమ సేవలకు రాష్ట్రంలోనే మొదటిస్థానం
- కొండాపూర్‌కు కాయకల్ప అవార్డు
- ఎకో ఫ్రెండ్లీ కేటగిరీలోనూ ఫస్ట్



కొండాపూర్ జిల్లా ఆస్పత్రి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పేదలకు వైద్యసేవలందిస్తూ ఆరోగ్యానికి భరోసా ఇస్తున్న కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి జాతీయ ఆరోగ్య మిషన్ అందించే ‘కాయకల్ప అవార్డు’ దక్కింది. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి రూ.50 లక్షల నగదు అందుకోనుంది. ఎకో ఫ్రెండ్లీ కేటగిరీలోనూ మొదటి స్థానంలో నిలవడంతో మరో రూ.10 లక్షల నగదు బహుమతిని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ శ్వేత మహంతి ప్రకటించారు. నేషనల్ హెల్త్ మిషన్, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, క్వాలిటీ అష్యూరెన్స్ టీమ్ గత ఏప్రిల్ 28న కొండాపూర్ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. స్వచ్ఛత, ఇన్‌ఫెక్షన్ సోకకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, రోగులకు వారి కుటుంబ సభ్యులకు అందుతున్న సదుపాయాలు, బయో మెడికల్ వేస్టేజ్, పారిశుద్ధ్యం, సిబ్బంది పనితీరు, రికార్డుల నమోదు తదితర అంశాలపై అధ్యయనం చేశారు. 2022–23 ఏడాదికి గాను ఇటీవల ఫలితాలను వెల్లడించారు. జిల్లా ఆస్పత్రుల కేటగిరీలలో కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రి 92.13 శాతం స్కోర్‌తో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దీంతో రూ.50 లక్షల నజరానా దక్కనుంది. 33 జిల్లా ఆస్పత్రులుండగా కాయకల్ప అవార్డుల ఎంపిక ప్రక్రియలో 13 జిల్లా ఆస్పత్రులు నిలిచాయి. అందులో కొండాపూర్ జిల్లా ఆస్పత్రి ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హం.

ఎకో ఫ్రెండ్లీ కేటగిరీలోను ప్రథమ స్థానం

ఎకో ఫ్రెండ్లీ కేటగిరిలోనూ 93.57 స్కోర్‌తో కొండాపూర్ జిల్లా ఆస్పత్రి రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచిందని కొండాపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదా చారి తెలిపారు. రూ.10 లక్షల నగదు అందుతుందన్నారు. చెత్త సేకరణను మూడు రకాలుగా విభజిస్తున్నారు. మానవ వ్యర్థాలు, చెత్తను జీహెచ్‌ఎంసీ ద్వారా, బయో మెడికల్ వేస్ట్ ను ఏజెన్సీల ద్వారా, ఈ వేస్ట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను సవ్యంగా నిర్వహించడంతో ఎకో ఫ్రెండ్లీ కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచింది.

ఆస్పత్రి ప్రస్థానం

100 పడకలతో ప్రారంభమైన కొండాపూర్ ఏరియా ఆస్పత్రిని 2014లో జిల్లా ఆస్పత్రిగా మార్చారు. 220 పడకలతో పేద రోగులకు వైద్య సేవలందిస్తోంది. ఐసీయూ బెడ్స్–28, వెంటిలేటర్ బెడ్స్–20 ఉండగా అన్ని బెడ్స్‌కు ఆక్సిజన్ సౌకర్యం ఉంది. జనరల్ మెడిసన్, సర్జరీ, గైనకాలజీ, పిడియాట్రిక్, ఎక్స్‌రే, స్కానింగ్, టి హబ్ తదితర విభాగాలు ఉన్నాయి. మొత్తం 250 మంది సిబ్బంది ఉన్నారు. 30 మంది డాక్టర్లు, 28 మంది నర్సులు, 60 మంది పారామెడికల్ సిబ్బంది, 50 మంది శానిటేషన్ సిబ్బంది, 30 మంది టీ హబ్‌లో పని చేస్తున్నారు. బ్లడ్ బ్యాంక్, రెండు ఆక్సిజన్ ప్లాంట్లు, కంటి ఆపరేషన్ థియేటర్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ అందుబాటులో ఉంది. ప్రతి రోజు ఓపీలో 500 నుంచి 600 మందికి వైద్య సేవలందిస్తారు. ఇన్ పేషెంట్లు 130 నుంచి 150 వరకు ఉంటారు. ప్రతి నెల 280 నుంచి 300 ప్రసవాలు చేస్తారు.

ఇది సమష్టి కృషి



డాక్టర్లు, నర్సులు, ఇతర విభాగాల సిబ్బంది కృషితోనే కాయకల్ప అవార్డు దక్కింది. 2014లో కాయకల్ప అవార్డులో మూడవ స్థానంలో నిలిచాం. ప్రస్తుతం కాయకల్ప అవార్డు, ఈకో ఫ్రెండ్లీ కేటగిరీలలో మొత్తం రూ.60 లక్షల నగదు దక్కింది. ఉన్నతాధికారుల మార్గదర్శకాలతో ఆస్పత్రిలో కమిటీ వేసి రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు నగదును వినియోగించుకుంటాం. అవార్డు దక్కినందుకు డాక్టర్లు, సిబ్బందికి అభినందనలు.

–డా.వరదాచారి, సూపరింటెండెంట్, కొండాపూర్ జిల్లా ఆస్పత్రి

నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ సర్టిఫికెట్

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి ప్రతిష్టాత్మక నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ సర్టిఫికెట్ దక్కింది. 94.3 శాతం స్కోర్‌తో నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ సర్టిఫికెట్‌కు ఎంపికైనట్లు భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ ప్రకటించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. 95.7 శాతం స్కోర్‌తో లేబర్‌రూమ్, 92.2శాతం స్కోర్‌తో మెటర్నిటీ ఆపరేషన్ థియేటర్‌లకు సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలిపారు. 80 అంశాలను పరిశీలించి ఈ అవార్డులు ప్రకటించారని ఆయన పేర్కొన్నారు.

మానవ జీవితంలో పర్యావరణం కీలకం

–హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు



హెచ్‌సీయూలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న వీసీ బీజేరావు

రాయదుర్గం: పర్యావరణం మానవ జీవితంలో కీలకపాత్ర పోషిస్తుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. పర్యావరణంలో మొక్కలు, జంతువులు, ఆహారం, సహజ వనరులు, నీరు తదితరాలు ఉంటాయని వాటన్నింటినీ పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ ప్రాంగణంలో సోమవారం హెచ్‌సీయూ గెస్ట్ హౌస్ ప్రవేశ ద్వారం వద్ద ‘బౌహినియా ఆక్యుమినాటా’ అనే మొక్కను వీసీ ప్రొఫెసర్ బీజేరావు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2023 యొక్క థీమ్ ‘బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్–ఎకో సిస్టమ్ రెస్టోరేషన్’ ప్రకటించారన్నారు. పూర్వం సహజసిద్ధ వాతావరణంలో జీవించారని, అందువల్ల వారు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపారన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచాలన్నారు. అనంతరం హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, ప్రో వీసీ ప్రొఫెసర్ ఆర్ ఎస్ సర్రాజు, ప్రొఫెసర్లు పి ప్రకాశ్‌బాబు, ఎం ఘనశ్యామ్ కృష్ణ, డాక్టర్ ఈరాల లోకానందరెడ్డి, డివిఎస్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్ ఘనత కేసీఆర్‌దే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మియాపూర్‌లోని సత్య భారతీ కన్వెన్షన్ హాల్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రగతి కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నాటి పాలకుల హయాంలో కరెంట్ కోతలు, పవర్ హాలిడేలతో జనం అష్టకష్టాలు పడ్డారని విద్యుత్ పంపిణీ సరిగ్గా లేక వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు కుదేలవడంతో జీవనోపాధి భారమై వలసలు పెరిగాయన్నారు. నేడు వ్యవసాయం, వాణిజ్య పరిశ్రమలతో సహా అన్ని రంగాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాతో భారత దేశ ధాన్యాగారంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉప కమిషనర్లు వెంకన్న, సుదాంష్, కార్పొరేటర్లు పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేష్,నాగేందర్‌యాదవ్, శ్రీనివాస్‌రావు, రోజాదేవి రంగారావు, విద్యుత్ అధికారులు డీఈ గోపాలకృష్ణ, ఏడీఈలు, ఏఈలు, విద్యుత్‌శాఖ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ అని బకాయిల తెలంగాణ చేశారు

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



శ్రీరామ్‌నగర్ ఏబ్లాక్‌లో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: బంగారు తెలంగాణ చేస్తామని చెప్పి బకాయిల తెలంగాణగా మార్చారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆరోపించారు. సోమవారం రాత్రి గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ డివిజన్ గౌతమి ఎన్‌క్లేవ్, శ్రీరామ్‌నగర్ ఏబ్లాక్‌లో ఇంటింటికి వెళ్లి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 9 ఏళ్ళలో సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను అబద్ధాలతో మోసం చేయడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి ఇవ్వలేదన్నారు. పరీక్షా ప్రశ్న పత్రాల లీకేజీ ఇలా అన్ని విధాలుగా నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. ఆర్టీసీ చార్జీలు, కరెంటు బిల్లులు పెంచుతూ పోతున్నారన్నారు. అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, వసూళ్లకు అడ్డాగా శేరిలింగంపల్లిని మార్చారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీశైలంయాదవ్, వెంకటేష్, అనంతరెడ్డి, రంగస్వామి, ఆంజనేయులు, కృష్ణ, పద్మ, పార్వతి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయం ప్రారంభం



డీసీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ నూతన కార్యాలయాన్ని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. గచ్చిబౌలి పీఎస్ భవనంలోని రెండో అంతస్తులో ట్రాఫిక్ డీసీపీ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ కార్యాలయాలను నిర్మించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా నార్సింగి, రాయదుర్గం, మేడ్చల్, ఆర్‌సీపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్‌ను మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ హనుమంతరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీలు నంద్యాల నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ హన్మంతరావు, ఇన్‌స్పెక్టర్లు సురేష్, నవీన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

‘మనూ’లో యోగా వర్క్‌షాప్



రాయదుర్గం: మనూలో సోమవారం యోగా శిక్షణ, వర్క్‌షాప్‌ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్ ప్రారంభించారు. ఉర్దూ యూనివర్శిటీలోని నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్), యూనివర్శిటీ సెంటర్ ఫర్ యోగిక్ సైన్స్(యూసీవైఎస్) పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని రెండు వారాల పాటు నిర్వహిస్తారు. జూన్ 23వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్, ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ మోషాహిద్‌లు యోగా ప్రాముఖ్యతను వివరించగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విని యోగా ఆసనాల గురించి వివరించారు.

ఘనంగా తెలంగాణ చెఫ్ అసోసియేషన్ వార్షికోత్సవం



చెఫ్ వార్షికోత్సవంలో పాల్గొన్న పాకశాస్త్ర నిపుణులు

మాదాపూర్: మాదాపూర్‌లోని ట్రిడెంట్ హోటల్‌లో సోమవారం తెలంగాణ చెఫ్ అసోసియేషన్ నాల్గో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మేంద్ర మాట్లాడుతూ ముంబై, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌కు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌ల విద్యార్థులు, పాకశాస్త్ర నిపుణులు,గృహిణులు, ప్రఖ్యాత చెఫ్‌లు ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. హోటల్ పరిశ్రమలో కొత్త పోకడలు, చెఫ్ ప్రపంచంలో పని, జీవిత సంతులనం ప్రాముఖ్యత, మిల్లెట్స్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రముఖ చెఫ్‌లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చెఫ్‌లు శంకర్ కృష్ణమూర్తి, , జెర్సన్ ఫెర్నాండెజ్, అనిల్‌గ్రోవర్ , అజయ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

‘రన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్’

రాయదుర్గం: మనూను ‘ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్’గా రూపొందించేందుకు అందరూ సహకరించాలని స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్ ఖాన్ కోరారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్కూల్ ఆఫ్ సైన్సెస్ కెమిస్ట్రీ విభాగంలో ‘రన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్’ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, మానవ ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పర్యావరణ అనుకూల జీవనశైలిని అవలంబించడానికి ప్రతి ఒక్కరూ తమవంతూ బాధ్యతను గుర్తించాలన్నారు. అంతకుముందు స్కూల్ ఆఫ్ సైన్సెస్ భవనం వద్ద జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు.అనంతరం క్యాంపస్‌లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ సంచులు, సీసాలు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను సేకరించి పారవేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో మరో కొత్త కోర్సుకు శ్రీకారం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో మరో కొత్త కోర్సు మోడలింగ్, సిమ్యులేషన్‌లో ఎంటెక్ కోర్సును అందించేందుకు ఏర్పాట్లు చేశారు. మల్టీ డిసిప్లినరీ కోర్సుగా దీన్ని ప్రకటించారు. సీసీఎంటీ–2023 ప్రక్రియపై ఆసక్తి గల అభ్యర్థులు కోర్సుకు సంబంధించిన వివరణాత్మక సమాచారం, అర్హత, ఇతర అంశాల కోసం సీఎంఎస్‌డీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్ సాయిబాబాను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

రాయదుర్గం: వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గౌలిదొడ్డిలోని వివేకానందనగర్‌లో మైసమ్మ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు.కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, ఇతర నాయకులను ఆలయ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

హస్తకళా ప్రదర్శన ప్రారంభం



హస్తకళల ప్రదర్శనను ప్రారంభించిన టీటా అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల

మాదాపూర్: మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన హస్తకళా, చేనేత ఉత్పత్తుల ప్రదర్శనను టీటా(తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్) ఫౌండర్ సందీప్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబ వ్యవస్థ బాగుంటుందన్నారు. వారిని ప్రోత్సహించాలన్నారు. దాదాపు 110 స్టాల్స్‌లో చేనేత హస్తకళల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కొండపల్లి బొమ్మలు, సాఫ్ట్ టాయిస్, పోచంపల్లి చీరలు ఉన్నాయి. కార్యక్రమంలో టీసీసీఐ సభ్యులు , మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుమార్తె శ్రీహిత పాల్గొన్నారు.

‘బంజారాల పై దాడులను ఆపాలి’

మియాపూర్ : బంజార కుటుంబాలను సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఇబ్బందులపాలు చేస్తున్నారని నడిగడ్డతండా గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రత్నకుమార్ అన్నారు మియాపూర్‌లోని నడిగడ్డతండాలో ఇళ్ల మరమ్మతులు చేయనివ్వకుండా అడ్డుకున్నంటున్నారంటూ సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి కోకనట్ అపార్ట్‌మెంట్ పక్కన గల ప్రభుత్వ స్థలంలో ఓ బిల్డర్ గోడ కడుతుంటే సీఆర్‌పీఎఫ్ సిబ్బంది స్పందించ లేదని, అదే గిరిజన కుటుంబాలు కూలిన ఇళ్లను బాగు చేసుకుంటుంటే దాడి చేస్తున్నారని ఇది తగదన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మాదాపూర్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో 360 లైఫ్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో నిత్యం వందలాది భవనాలు నిర్మితమవుతున్నప్పటికీ వాతావరణం అనుకూలంగా ఉండేందుకు అదే స్థాయిలో పచ్చదనాన్ని కూడా పెంచుతున్నామన్నారు. 360 లైఫ్ సంస్థ అధినేత శ్రీకాంత్ మాట్లాడుతూ నగరంలో తొలిసారిగా ఎకోఫ్రెండ్లీ కాన్సెప్ట్‌తో తాము బహుళ అంతస్తుల సముదాయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు ప్రకాశ్‌బెలవాడి తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన



పటాన్‌చెరు టౌన్: ఇటీవల ఉగాండా దేశంలోని కంపాలలో అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఐటీఎఫ్) జూనియర్ టోర్నీ జరిగింది. ఈ టోర్నీలో తెలంగాణ రాష్ట్రం నుంచి నూకల షశ్వితరెడ్డి పాల్గొని సింగిల్‌లో రన్నర్‌గా, డబుల్స్ విభాగంలో జర్మనీతో ఆడి టైటిల్ సాధించిన విషయం తెలిసిందే. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన నివాసంలో షస్విత రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచ వేదికపై ఇనుమడింపచేయడం గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. క్రీడల్లో కూమార్తెను ప్రోత్సహిస్తున్న షస్విత రెడ్డి తండ్రి పటాన్‌చెరు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి లేగల గ్రౌండ్స్‌లో నిర్వహించిన పురం విశ్వకాంత్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాదాపూర్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు అనిరుధ్ యాదవ్‌లు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆదిత్య, అభిషేక్ యాదవ్, గోపాల్‌యాదవ్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.